సాక్షి ఒడిశా

మంగళవారం। 3। సెప్టెంబర్। 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.9.60.236లు, బంగారం 350 మిల్లీగ్రాములు వెండి 35గ్రాముల 300 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



పలు రైళ్లు రద్దు

బంగాళాఖాతంలో ఏర్పడిన భారీ వర్షాల ప్రభావంతో రైలు పట్టాలు నీట మునగడంతో పలురైళ్లు రద్దు చేసినట్లు రైల్వే శాఖ ప్రకటించింది.

- 11లో



రాష్ట్రంలో 2 లక్షల పోస్టులు ఖాళీ

రాష్ట్రంలో రెండు లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయని సీఎం మోహన్‌చరణ్ మాఝీ అసెంబ్లీలో సోమవారం ప్రకటించారు.

- 11లో

న్యూస్‌రీల్

నందన్‌కానన్‌కు కొత్త అతిథులు



కొత్త జిరాఫీల జంట

భువనేశ్వర్: బారంగ్ నందన కానన్ జంతు ప్రదర్శనశాలకు కొత్త అతిథులు విచ్చేశారు. కోల్‌కతా జంతు ప్రదర్శన శాల నుంచి 2 జిరాఫీలను తీసుకొని వచ్చారు. సందర్శకులకు అతి త్వరలో ఇవి కనువిందు చేయనున్నాయి. దీంతో ఇప్పటివరకు నందన కానన్‌లో ఒంటరిగా ఉన్న జిరాఫీ ఖుషి సహవాసానికి కొత్త దోస్తులుగా చేరాయి. ఇక్కడ ఆఫ్రికన్ పనోరమా ఆవిష్కరణ లక్ష్యంగా వీటిని రప్పించినట్లు అధికారుల సమాచారం . కొత్తగా విచ్చేసిన వాటిలో ఏడాదిన్నర వయసున్న మగ, 13 నెలల ఆడ జిరాఫీ ఉన్నాయి. ఈ రెండింటి రాకతో జిరాఫీల సంఖ్య 3కి పెరిగింది. త్వరలో చిరుతలు మరియు జీబ్రాలు నందనకానన్ రానున్నాయి. జంతు మార్పిడి కార్యక్రమంలో భాగంగా ఇక్కడికి తీసుకురావడం విశేషం. ఇప్పటివరకు జంతు ప్రదర్శనశాలలో 2012లో పాట్నాలోని సంజయ్ గాంధీ బయోలాజికల్ పార్క్ నుంచి తీసుకొచ్చిన ఆడ జిరాఫీ ఖుషి మాత్రమే ఉంది.

పట్టాలు తప్పిన గూడ్స్ రైలు



పట్టాలు తప్పిన ఇంజిన్

భువనేశ్వర్: పారాదీప్ పోర్టు బౌరియపాలొందా వద్ద సోమవారం గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. ఇంజిన్ నుంచి 17 వ్యాగన్లు విడిపోయాయి. వీటిలో ఒక వ్యాగన్ బోల్తా పడింది. మరొకటి పాక్షికంగా పట్టాలు తప్పి పక్కకు ఒరిగింది.

నాగుపాము కలకలం



బైకు సీటు కింద ఉన్న పామును తీస్తున్న దృశ్యం

రాయగడ: బైకు సీటు కింద నాగుపాము కలకలం సృష్టించింది. జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి పంచాయతీలోని డొంగాశిలి వద్ద ఈ సంఘటన సోమవారం చోటు చేసుకుంది. ఇంటి నుంచి బైకుపై వెళ్తున్న జోడియాకు కొంత దూరం వెళ్లగా నాగుపాము బుసలు కొడుతున్న శబ్దం వినిపించింది. దీంతో వెంటనే బైక్ ఆపి పరిశీలించగా, అందులో నాగుపాము ఉండడం కనిపించింది. దీంతో వెంటనే స్నేక్ క్యాచర్‌కు సమాచారం ఇచ్చాడు. దీంతో అతను వచ్చి పాముని పట్టి సమీపంలోని అడవిలో విడిచిపెట్టారు.

పంట పొలంపై విష ప్రయోగం



పాడైపోయిన పంట పొలం వద్ద కీర్తన్ ఆవేదన

కొరాపుట్: మూఢ నమ్మకాలతో పచ్చని వరి పంటపై విష ప్రయోగం జరిగిన ఘటన నబరంగ్‌పూర్ జిల్లా రాయిఘర్ సమితి పారువా గ్రామ పంచాయతీ ఇంద్రానగర్ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పదేళ్ల క్రితం కీర్తన్ తండ్రి రాంనాథ్ శాంత చేతబడులు చేస్తున్నాడనే ఆరోపణలపై గ్రామస్తులు గ్రామ బహిష్కరణ చేశారు. దీంతో ప్రాణ భయంతో కుటుంబం వదలి రాంనాథ్ శాంత సుదూర ప్రాంతాలకు వెళ్లి పోయాడు. అయితే ఇటీవల ఆయన మరలా గ్రామానికి వచ్చి కుటుంబాన్ని కలుసుకున్నాడు. తమకు 5 ఎకరాలకుపైగా వ్యవసాయ భూమి ఉందని కొడుకు కీర్తన్‌కి చెప్పాడు. వెంటనే కీర్తన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసి అమీన్ ద్వారా భూమిని గుర్తించి ఈ ఏడాది వరిపంట వేశాడు. అదే సమయంలో గ్రామానికి చెందిన చిత్త శాంత పలుమార్లు కీర్తన్‌పై దాడి చేసి వ్యవసాయం ఆపాలని హెచ్చరించాడు. ఇంతలో పంట పెరిగింది. ఇదే సమయంలో తన మిత్రులను కలవడానికి కొద్ది రోజులు వేరే ప్రాంతానికి కీర్తన్ వెళ్లి, తిరిగి వచ్చేసరికి ఈ దారుణం జరిగింది. మొత్తం పంట పొలంపై విషపూరిత ద్రవాలు చల్లబడి ఉండడంతో పంట నాశనమైంది. దీంతో బాధితుడు రాయిఘర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

మట్టిని తీసి.. ప్రాణం పోసి..!



అమలాభట్ట గ్రామం

మనం చేసుకునే పండగల వెనుక ఉద్దేశం ప్రతి ఒక్కరూ ప్రకృతితో మమేకమవ్వడం. కానీ ఆధునికత పేరుతో పండగలు పర్యావరణానికి విఘాతం కలిగేలా మారిపోవడం వలన వాటి స్ఫూర్తి దెబ్బతింటోంది. ముఖ్యంగా వినాయక చవితికి విగ్రహాలు అందంగా ఉండాలని ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌ను ఉపయోగిస్తున్నారు. దీనివలన పర్యావరణం కలుషితమై జీవకోటికీ ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉంది. అందువలన ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలు ఉపయోగించాలనే ఉద్దేశంతో అమలాభట్ట గ్రామస్తులు ఎన్నో ఏళ్లుగా మట్టి విగ్రహాలను తయారు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. అలా మట్టిమేలు తలపెడుతున్న మనుషులను ఒకసారి పలకరిద్దాం...

– రాయగడ

- మట్టి విగ్రహాలకు ప్రాణం పోస్తున్న అమలాభట్ట గ్రామస్తులు
- వృత్తినే నమ్ముకొని జీవిస్తున్న 50 కుటుంబాలు
- వివిధ రూపాల్లో విగ్రహాలు లభ్యం



మువ్వగోపాలుడి రూపంలో గణనాథుడు

రాయగడకు సుమారు 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న అమలాభట్ట గ్రామంలో నివాసముంటున్న సుమారు 50 కుటుంబాలు మట్టినే నమ్ముకుని జీవిస్తున్నాయి. ఏళ్ల తరబడి వంశపారపర్యంగా వస్తున్న వృత్తిని గౌరవిస్తూ జీవనోపాధి పొందుతున్నాయి. మట్టితో తయారు చేసే ప్రమిదలు, కుండలు వంటివి వీళ్లు విక్రయిస్తుంటారు. అయితే వినాయక చవితి వచ్చిందంటే వీరికి చేతినిండా పనే. రెండు నెలల ముందే విగ్రహాల తయారీలో నిమగ్నమవుతుంటారు. అమలాభట్ట విగ్రహాల తయారీలో ప్రత్యేక గుర్తింపు పొందిందనడంలో అతిశయోక్తి కాదు. వీరి చేతుల మీదుగా రూపొందిన గణనాథులకు భలే గిరాకీ ఉంటుంది. ఇటు ఆంధ్రప్రదేశ్‌లోని మన్యం జిల్లాలో పార్వతీపురం, బొబ్బిలి వంటి ప్రాంతాలతో పాటు, అటు ఒడిశాలోని కొరాపుట్, గజపతి, మల్కన్‌గిరి, నవరంగపూర్ తదితర జిల్లాల నుంచి విగ్రహాలను ఖరీదు చేసేందుకు వస్తుంటారు. వారు తీసుకొచ్చిన నమూనాల ప్రకారం రూపొందించిన వినాయకులకు ప్రత్యేక ధరలు ఉంటాయి. ప్రస్తుతం ఈ గ్రామంలో రూపొందిస్తున్న విగ్రహాలు వివిధ రూపాల్లో దర్శనం ఇవ్వబోతున్నాయి. ఉగ్ర నరసింహుడి నీడలో, మురళీ కృష్ణ అవతారం రూపంలో, శ్రీరాముడు, బుద్ధుడు, కురుక్షేత్రంలో శ్రీకృష్ణుని వెంట యుద్ధం చేసే అర్జునుడు వంటి ప్రత్యేక రూపాలు రూపుదిద్దుకుంటున్నాయి.



విగ్రహాల తయారీలో మహిళలు

చేతినిండా పని

ఈ ఏడాది చేతినిండా పని ఉండడంతో ఇంటిల్లిపాది విగ్రహాల తయారీలో నిమగ్నమయ్యారు. ఇతర ప్రాంతాల్లో పనులు చేసుకుని జీవిస్తున్న కొంతమంది యువకులు ఈ సీజన్‌లో తమ తల్లిదండ్రులకు చేదుడుగా ఉండేందుకు రెండు నెలల ముందుగానే ఇంటికి చేరుకుంటారు. ఇదిలాఉండగా విద్యార్థులు కూడా చదువురీత్యా దూర ప్రాంతాల్లో ఉంటున్నప్పటికీ సీజన్‌లో వారు కూడా సహకరించేందుకు వస్తుంటారు. ఇటు చదువు, అటు కులవృత్తిలో ఆరితేరిన ఎంతోమంది విద్యార్థులు ఈ గ్రామంలో ఉంటున్నారు.

కష్టానికి తగ్గ ఫలితం శూన్యం

ఈ ఏడాది ఆర్డర్లు బాగానే వస్తున్నప్పటికీ కష్టానికి తగ్గ ఫలితం లేకపోతోందని కళాకారులు అంటున్నారు. మట్టి తమ గ్రామ సమీపంలో లభిస్తున్నప్పటికీ, విగ్రహాలకు అద్దే రంగుల ధరలు ఆకాశాన్ని అంటుతుండడంతో తప్పనిసరిగా విగ్రహాల ధరలను పెంచడం జరిగిందని వివరిస్తున్నారు.



రంగులు అద్దుతున్న యువతులు

సుమారు రూ.10 నుంచి రూ.30 వేల ధరల వరకు విగ్రహాలు రూపుదిద్దుకుంటున్నాయన్నారు. కేవలం పర్యావరణ హితమైన రంగులతో రూపొందిస్తున్న విగ్రహాలకు ఒకొక్కసారి ఆదరణ కరువవుతోందని చెబుతున్నారు.



రూపుదిద్దుకుంటున్న విగ్రహాలు



కురుక్షేత్రంలో...

తల్లిదండ్రులకు సహకరిస్తున్నాం



నేను మెకానికల్ ఇంజినీరింగ్ చదువుకున్నా సరైన ఉపాధి అవకాశాలు లేక పోవడంతో కులవృత్తిపైనే ఆధారపడాల్సి వస్తోంది. సీజన్ సమయంలో తల్లిదండ్రులకు సహకరించేందుకు కష్టపడుతుంటాం. మిగతా సమయంలో పనులు లేకపోతే ఉపాధి కోసం వెతుక్కోవాల్సిన పరిస్థితి ఉంటుంది. సీజన్‌లో కష్టపడితే కొంత డబ్బులు లభిస్తాయనే ఆశతో రాత్రీ పగలు కష్టపడుతుంటాం.

– రేగాన శంకరరావు, అమలా

షెడ్డు నిర్మిస్తే ప్రయోజనం



మా గ్రామంలో సుమారు 50 కుటుంబాలకు పైగా మట్టిని నమ్ముకునే జీవిస్తున్నాం. మట్టితో రూపొందించే వస్తువుల తయారీ కోసం సరైన షెడ్డు లేక పోవడం వలన ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోతోంది. ఇప్పటికైనా నాయకులు, అధికారులు స్పందించి మా కష్టాలు తీర్చాలి

– పొందూరు సత్యనారాయణ, అమలాభట్ట భట్ట

బతుకులు మారేదెన్నడో



ప్రతీ ఏడాది ఈ సీజన్‌లో ఇంటిల్లిపాది కష్టపడుతుంటాం. అయితే కష్టానికి తగ్గ ఫలితం మాత్రం రావడం లేదు. రెండు నెలల ముందుగానే అన్నీ సిద్ధం చేసుకొని ఆర్డర్ల కోసం ఎదురు చూస్తుంటాం. తీరా వర్షం వస్తే తయారీ చేసిన విగ్రహాలు తడిచి పాడైపోతాయనే భయమే ఎక్కువ ఉంటుంది. అదే సరైన షెడ్డు ఉంటే ఈ తిప్పలు ఉండవు. ఒకొక్కసారి పెద్ద పెద్ద విగ్రహాలు వర్షాల కారణంగా తడిచి వేసిన రంగులు పాడైపోతుంటాయి. దీంతో కష్టంపోగా మిగిలేది నష్టం మాత్రమే.


– పొందూరు రాజేశ్వరి, అమలాభట్ట

లక్షల్లో విక్రయాలు




ప్రతీ ఏడాది లక్షల రుపాయల్లో విగ్రహాల విక్రయాలు జరుగుతుంటాయి. నేను ఎంబీఏ పూర్తి చేసుకొని ఉద్యోగ వేటలో ఉన్నాను.ఈ సీజన్‌లో మాత్రం చేతివృత్తిని గౌరవించి విగ్రహాలు తయారీ చేస్తుంటాను. చిన్నప్పటి నుంచి విగ్రహాల తయారీ తల్లిదండ్రుల వద్ద నేర్చుకున్నాను. వచ్చిన చేతి పనిని ఇలా వినియెగిస్తుంటాను.

– పొందూరు నవీన్, అమలాభట్ట



బుద్ధుడి అవతారంలో...



సింహంపై ఆసీనుడైన గణనాథుడు



ఉగ్ర నరసింహుడి రూపంలో...



శ్రీరాముడి రూపంలో...



జఘాధారుని రూపంలో...

‘హైకోర్టు బెంచ్ ఏర్పాటు సాధ్యం కాదు’

భువనేశ్వర్: రాష్ట్రంలో ఏ ప్రాంతంలోనూ ఒరిస్సా హైకోర్టు బెంచ్ ఏర్పాటు సాధ్యం కాదని ముఖ్యమంత్రి మోహన్ మాఝీ సోమవారం శాసన సభలో లిఖిత పూర్వకంగా తెలియజేశారు. బొలంగీర్ ఎమ్మెల్యే కలికేష్ నారాయణ్ సింగ్ దేవ్ అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ ముఖ్యమంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. బొలంగీర్‌లో ఒరిస్సా హైకోర్టు సర్క్యూట్ బెంచ్‌ను ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వానికి ఏమైనా ప్రతిపాదనలు ఉన్నాయా లేదా అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఎమ్మెల్యే అడిగిన ప్రశ్నకు ముఖ్యమంత్రి సమాధానమిస్తూ.. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం రాష్ట్రంలోని ఏ ప్రాంతంలోనైనా ఒరిస్సా హైకోర్టు బెంచ్ ఉండటం సమర్థనీయం కాదన్నారు.

గున్న ఏనుగు కళేబరం లభ్యం

భువనేశ్వర్:

సిమిలిపాల్ అభయారణ్యంలో గున్న ఏనుగు కళేబరం లభించింది. సౌత్ డివిజన్ జెనాబిల్ రేంజ్ ఆఫీస్ సమీపంలో గున్న ఏనుగు కళేబరం పడి ఉన్నట్లు అధికారుల దృష్టికి వచ్చింది. దీని వయసు ఏడాది ఉంటుందని అంచనా. మరణానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

చికిత్స పొందుతూ మరో ఏనుగు మృతి

చందకా గొడిబడీలో అస్వస్థతకు గురైన ఏనుగు చికిత్స పొందుతూ మృతి చెందింది. అనారోగ్యం బారినపడడంతో నందన్‌కానన్, ఓయూఏటీ జంతు వైద్య నిపుణుల బృందం ఆధ్వర్యంలో చికిత్స కొనసాగించారు. వారం రోజుల నిరవధిక చికిత్స, వైద్య ప్రయత్నాలు ఫలించలేదు. చికిత్స పొందుతూ మూడేళ్ల ఏనుగు పిల్ల మృతి చెందింది. బొలంగీర్ దేవగాంప్ అటవీ ప్రాంతంలో గుంపు నుంచి దారి మళ్లి ఒంటరి కావడంతో దీనిని చందకా ఏనుగుల అభయారణ్యానికి తీసుకొచ్చారు.



గున్న ఏనుగు కళేబరం

విద్యుత్ షాక్‌తో సివిల్ సప్లయ్ ఉద్యోగి మృతి



మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి ప్రభుత్వ క్వార్టర్స్‌లో నివాసముంటున్న పోడియ సమితి సివిల్ సప్లయ్ అధికారి దుస్తులను ఇస్త్రీ చేస్తున్న సమయంలో విద్యుత్ షాక్ తగిలి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. పోడియా సమితి సవిల్ సప్లయ్ అధికారి కుముదయ గోమాంగో(33) గత రెండేళ్లుగా ప్రభుత్వ క్వార్టర్స్‌లో ఉంటున్నాడు. సోమవారం తను వేగంగా ఆఫీస్‌కి వెళ్లాలనే ఉద్దేశంతో ఇస్త్రీ చేస్తుండగా విద్యుత్ షాక్ తగలడంతో కేకలు వేశాడు. వెంటనే స్థానికులు గమనించి కలిమెల సమితి అధికారి ప్రదీప్ కుమార్ కోర అధ్వర్యంలో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి తలుపులు తీసి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు పేర్కొన్నారు. దీంతో మృతదేహాన్ని కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మృతుడు రాయగడ జిల్లా పద్మాపూర్ సమితి లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి అవ్వడంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించనున్నారు.

మర్యాదపూర్వక భేటీ



మాజీ అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు, కోచ్ పుల్లెల గోపీచంద్ రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా సోమవారం కలిశారు. రాష్ట్రంలో బ్యాడ్మింటన్ క్రీడ అభివృద్ధిపై సంక్షిప్తంగా చర్చించినట్లు తెలిపారు.

– భువనేశ్వర్

క్లుప్తంగా

మూడేళ్లలో 17,758 ఆత్మహత్యలు

● సీఎం మోహన్‌చరణ్ మాఝీ

భువనేశ్వర్: రాష్ట్రంలో గత మూడేళ్లలో 17,758 మంది ఆత్మహత్యలు చేసుకున్నారని సీఎం మోహన్ చరణ్ మాఝీ ప్రకటించారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ఎమ్మెల్యే ధ్రువ్ చరణ్ సాహు లేవనెత్తిన ప్రశ్నకు లిఖిత పూర్వక సమాధానం ప్రవేశపెట్టారు. 2021 నుంచి 2023 వరకు ఈ మేరకు సమగ్ర సమాచారం సభలో దాఖలు చేశారు. 3 ఏళ్లలో 218 మంది విద్యార్థులు, 263 మంది విద్యార్థినులు ఆత్మహత్య చేసుకున్నట్లు విశ్లేషించారు. 2023లో అత్యధికంగా 104 మంది విద్యార్థినులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. ఈ 3 ఏళ్లలో నలుగురు రైతులు ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నారు.

4కి పెరిగిన కల్తీ సారా మృతులు

భువనేశ్వర్: గంజాం జిల్లా చికిటి నియోజకవర్గంలో గత నెల 19న చోటు చేసుకున్న కల్తీ సారా ఘటనలో మరో వ్యక్తి సోమవారం మృతి చెందాడు. దీంతో ఈ విషాద సంఘటన మృతుల సంఖ్య 4కి పెరిగింది. బరంపురం ఎంకేసీజీ వైద్య కళాశాల ఆస్పత్రి (ఎంసీహెచ్)లో చికిత్స పొందుతూ సోమవారం తుదిశ్వాస విడిచాడు. మృతుడు జెనాపూర్ గ్రామానికి చెందిన ప్రదీప్ బెహెరాగా గుర్తించారు.

సుభద్ర యోజన పోర్టల్ ఆవిష్కరణ

● వెబ్‌సైట్ ఆవిష్కరించిన డిప్యూటీ సీఎం ప్రభాతి పరిడా
● పథకం విధివిధానాలపై ప్రతిపక్షాల మండిపాటు


స్పీకర్ పోడియం చుట్టుముట్టిన విపక్ష సభ్యులు

భువనేశ్వర్: రాష్ట్రంలో తొలిసారిగా పాలన పగ్గాలు చేపట్టిన భారతీయ జనతా పార్టీ ఎన్నికల హామీ సుభద్ర యోజన కార్యాచరణ తీవ్ర దుమారం రేపుతున్న విషయం తెలిసిందే. కాగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మహిళా శిశు అభివృద్ధి శాఖ మంత్రి ప్రభాతి పరిడా సోమవారం ఈ పథకానికి సంబంధించిన వెబ్ పోర్టల్ ఆవిష్కరించారు. ఈనెల 17న విడుదల కానున్న సుభద్ర యోజన ప్రయోజనాల లబ్ధి కోసం ముందస్తుగా దరఖాస్తు చేసుకునేందుకు www.subhadra.odisha.gov.in వెబ్‌సైట్‌లో అవకాశం కల్పించారు. ఈ వెబ్‌సైట్‌లో పథకానికి సంబంధించిన సమగ్ర సమాచారం అందుబాటులో ఉందని తెలిపారు.

సభలో రచ్చ రచ్చ

సుభద్ర యోజన అమలు, కార్యాచరణకు సంబంధించి ఉభయ విపక్షాలు బిజూ జనతా దళ్, కాంగ్రెసు సభ్యులు అసెంబ్లీలో నిరసనలు తెలిపారు. స్పీకర్ పోడియం చుట్టుముట్టారు. సభా కార్యక్రమాలకు ఏమాత్రం అవకాశం లేకుండా చేశారు. ఎన్నికల్లో గెలిచేంత వరకు ఇచ్చిన హామీ గద్దెనెక్కడంతో వక్రీకరించారని విరుచుకుపడ్డారు. సభా కార్యకలాపాలను నిర్వహించలేక స్పీకర్ సుసామా పాఢి సభను అంచెలంచెలుగా 3 సార్లు వాయిదా వేశారు. ఉదయం 11.30 గంటలకు, మళ్లీ మధ్యాహ్నం 12.05 గంటలకు, ఆపై మధ్యాహ్నం 1.05 గంట వరకు వాయిదా వేశారు.


సుభద్ర యోజన పోర్టల్ ఆవిష్కరణ

ప్రభుత్వంపై విమర్శలు

ప్రతీ మహిళకు రూ.50,000 నగదు వోచర్ ఇస్తామన్న బీజేపీ ప్రభుత్వం మాట తప్పి మహిళలను నిలువునా మోసం చేసేందుకు పాల్పడుతోందని విపక్ష బీజేడీ విప్ ప్రమీలా మల్లిక్ విమర్శలు గుప్పించారు. పార్టీ అధికారంలోకి రావడానికి రాష్ట్రంలోని మహిళలకు అబద్ధాలు చెప్పి మోసం చేశారని ఆరోపించారు. రూ.50,000 నగదు వోచర్ అందజేస్తామని, రూ. 5,000 ముక్కుబడి చెల్లింపుతో చేతులు దులుపుకునే ప్రయత్నం జరుగుతోందన్నారు. ఎన్నికల ప్రచారంలో ప్రకటించిన విధంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రతీ మహిళకు రూ. 50,000 చొప్పున వోచరు విడుదల చేయాలని కాంగ్రెస్ సభ్యుడు తారా ప్రసాద్ బాహిణీపతి నిలదీశారు. బారాబటి - కటక్ ఎమ్మెల్యే సోఫియా ఫిర్దౌస్ మాట్లాడుతూ ప్రభుత్వం పథకానికి నిర్ణయించిన వయో పరిమితిని తొలగించాలని కోరారు. 60 నుంచి 80 సంవత్సరాల వయస్సు గల మహిళలను సుభద్ర యోజన నుంచి మినహాయించడం తీరని అన్యాయం అవుతుందని పేర్కొన్నారు.

రాష్ట్రంలో 2 లక్షల పోస్టులు ఖాళీ

● సీఎం మోహన్ చరణ్ మాఝీ


వివరాలు వెల్లడిస్తున్న సీఎం మోహన్ చరణ్ మాఝీ

భువనేశ్వర్: రాష్ట్ర అసెంబ్లీలో సోమవారం కేంద్రాపడా నియోజకవర్గం, విపక్ష బిజూ జనతా దళ్ ఎమ్మెల్యే గణేశ్వర్ బెహెరా ప్రశ్నకు బదులుగా ముఖ్యమంత్రి సభలో ప్రవేశపెట్టిన సమాచారం ప్రకారం రాష్ట్రంలో 2 లక్షలు పైబడి ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నట్లు స్పష్టం అవుతుంది. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలపై అడిగిన ప్రశ్నకు ముఖ్యమంత్రి స్పందిస్తూ, ఆర్థిక శాఖ సమాచారం ప్రకారం గతేడాది డిసెంబర్ 31 నాటికి ప్రభుత్వ ఉద్యోగాల సంఖ్య 5,96,647. ప్రస్తుత పలు విభాగాలు, శాఖల్లో ఖాళీల వివరాల్ని ముఖ్యమంత్రి సభలో ప్రవేశపెట్టారు. ఆయన సమాచారం ప్రకారం పాఠశాల, సామూహిక విద్యా శాఖలో అత్యధికంగా 63,405 పోస్టులు ఖాళీగా ఉన్నాయి, ఆ తర్వాత ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖలో 39,127 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆరోగ్య శాఖలో గ్రూప్-ఏ కేటగిరీలో 12,306 పోస్టులు, గ్రూప్-సీలో 18,183 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అదేవిధంగా పాఠశాల, సామూహిక విద్యా శాఖలో గ్రూప్-సీ విభాగంలో 37,680 పోస్టులు, గ్రూప్-బీలో 18,974 పోస్టులు ఖాళీగా ఉన్నాయని వెల్లడించారు. ఇవే కాకుండా హోం శాఖలో 19,889, రెవెన్యూ, విపత్తు నిర్వహణలో 11,810, జలవనరుల విభాగంలో 7,667, వ్యవసాయం, రైతు సాధికారత విభాగంలో 7,296, మత్స్య, పశు వనరుల శాఖలో 6,072 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

శ్రమదానంతో రోడ్డు నిర్మాణం

పర్లాకిమిడి: ప్రభుత్వం తమ గ్రామానికి రోడ్డు వేయకపోయినా శ్రమదానంతో యువకులు తమ గ్రామానికి రోడ్డు వేసుకున్నారు. గుసాని సమితి చందనకోలా గ్రామానికి రోడ్డు వేయాల్సిందిగా అనేకసార్లు అధికారులకు మొరపెట్టుకున్నారు. అయినా అధికారులు స్పందించకపోవడంతో తామే ముందుకు వచ్చారు. అందరూ కలిసి గ్రామానికి సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టారు.


శ్రమదానం చేపడుతున్న గ్రామస్తులు

సంక్షిప్తంగా..!

హంతకుడికి యావజ్జీవం

భువనేశ్వర్: సవతి కొడుకు తల చితగ్గొట్టి చంపిన తండ్రికి న్యాయస్థానం జీవిత ఖైదు శిక్ష విధించింది. స్థానిక అదనపు జిల్లా జడ్జి (ఏడీజే) – 2 కోర్టు సోమవారం ఈ తీర్పు వెలువరించింది. 2019 సంవత్సరం మార్చి 11న స్థానిక మంచేశ్వర్ ముండా సాహి ప్రాంతంలో నిందిత తండ్రి దాశరథి టుడు సవతి కుమారుడిని రాయితో తలను చితగ్గొట్టి చంపేశాడు.

హైకోర్టు బెంచ్ ఏర్పాటు కావాలి

భువనేశ్వర్: ఒడిశాలో హైకోర్టు శాశ్వత బెంచ్ ఏర్పాటు కావాలని అధికార పక్షం భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్యే జయ నారాయణ మిశ్రా డిమాండ్ చేశారు. పశ్చిమ ఒడిశాలో శాశ్వత బెంచ్ డిమాండ్ నిరవధికంగా కొనసాగుతోందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాలు ఉండగా ఉత్తరప్రదేశ్‌లో 3 హైకోర్టు బెంచ్‌లు పని చేస్తున్నాయని పేర్కొన్నారు.

చెట్టును ఢీకొని లారీ బోల్తా


లారీలో మంటలు చెలరేగిన దృశ్యం

మల్కన్‌గిరి: జిల్లాలోని మల్కన్‌గిరి సమితి పద్మాగిరి గ్రామం వద్ద సోమవారం సాయంత్రం జయపూర్ నుంచి భద్రాచలం కర్రల లోడ్‌తో వెళ్తున్న లారీ చెట్టును ఢీకొని బోల్తా పడింది. దీంతో వెంటనే లారీ నుంచి మంటలు చేలరేగాయి. మల్కన్‌గిరి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వచ్చి అదుపు చేశారు. కాగా లారీ డ్రైవర్ పరారయ్యాడు.

రాయగడ సుందరి-24 పోటీలు


పోటీల్లో పాల్గొన్న మహిళలు

రాయగడ: స్థానిక బిజూ పట్నాయక్ ఆడిటోరియంలో ఆదివారం సాయంత్రం రాయగడ -24 సుందరి పోటీలు జరిగాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో పోటీల్లో పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా జిల్లా కళా సంస్కృతి సంఘం ఉపాధ్యక్షుడు సంతోష్ కుమార్ బొచ్చ, ఈవెంట్ డైరెక్టర్ బిజయ్ కుమార్ మెలకలు వ్యవహరించారు. స్థానిక బీజీసీ సంస్థ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి.

చిట్‌ఫండ్ బాధితులకు నగదు

భువనేశ్వర్: రాష్ట్రంలో చిట్‌ఫండ్ బాధితులకు నగదు అందజేసినట్లు ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ శాసన సభ సమావేశాల్లో తెలిపారు. ఎమ్మెల్యే పవిత్ర సావంత్ ప్రశ్నకు సమాధానంగా ఈ విషయం తెలిపారు. 3 చిట్‌ఫండ్ కంపెనీల ఆస్తులను వేలం వేసి బ్యాంకు డిపాజిట్ల సొమ్మును బాధితులకు తిరిగి ఇచ్చినట్లు వివరించారు.

ఖైదీపై దాడి


సౌమ్యకాంత్ మహంతి

భువనేశ్వర్: స్థానిక ఝరపడా జైలులో తోటి ఖైదీపై దాడి ఘటన చోటు చేసుకుంది. హైదర్ కొడుకు మున్నా వర్గం తోటి ఖైదీ సౌమ్య కాంత్ మహంతి తలను పగులగొట్టారు. జైలులో రహస్య వ్యవహారాలు బయటకు పొక్కించాడన్న ఉక్రోషంతో ఈ దాడికి పాల్పడినట్లు సమాచారం. ఈ ఘటనపై జైళ్ల శాఖ ఏడీజీ అమితాబ్ ఠాకూర్ విచారణకు ఆదేశించారు. కటక్ డివిజన్ డీఐజీ అనుసయ జెనాను విచారణకు ఆదేశించారు.

విద్యార్థులకు పోటీలు


విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న అధికారులు

జయపురం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రాష్ట్రీయ ఆవిస్కార్ అభిజాన్‌పై విద్యార్థులకు పోటీలు సోమవారం నిర్వహించారు. బొరిగుమ్మ బ్లాక్ విద్యాధికారి సచిన్‌కుమార్ మల్లిక్ అధ్యక్షతన జరిగిన పోటీల్లో సమితిలోని వివిధ పాఠశాలల నుంచి 233 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏబీఈవో సంజుక్త పండ, సుభాష్ చంద్ర మఝి తదితరులు పాల్గొన్నారు.

39 మందిపై విజిలెన్స్ దాడులు

భువనేశ్వర్: గత రెండు నెలల్లో 39 మంది ప్రభుత్వ అధికారులపై ఒడిశా విజిలెన్స్ దాడులు నిర్వహించినట్లు రాష్ట్ర శాసనసభలో సీఎం మోహన్ చరణ్ మాఝి సోమవారం తెలిపారు. పూరీ జిల్లా బ్రహ్మగిరి నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే ఉపాసన మహాపాత్రో అడిగిన ప్రశ్నకు బదులుగా ఈ సమాచారం అందజేశారు. ఈ దాడుల్లో నిందిత అధికారులు కూడబెట్టిన సుమారు రూ.49.35 కోట్ల విలువైన అక్రమ ఆర్జిత ఆస్తులను జప్తు చేసినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా గత ఏడాది కాలంలో విజిలెన్స్ వర్గాలు చేపట్టిన దాడుల్లో దాదాపు రూ.115 కోట్ల విలువైన అక్రమ ఆర్జిత ఆస్తులను స్వాధీనం చేసుకున్నారన్నారు.

ఆస్పత్రిలో బీభత్సం సృష్టించిన వ్యక్తి అరెస్టు


అరెస్టైన నిందితుడు రమేష్ హరిజన్

జయపురం: పూల్‌బెడలోని జిల్లా కేంద్ర ఆస్పత్రిలో బీభత్సం సృష్టించిన వ్యక్తుల్లో ఒకరిని అరెస్టు చేసినట్లు జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర చంద్ర తండి సోమవారం వెల్లడించారు. ఆస్పత్రి అధికారి డాక్టర్ ఆర్.ఎన్.మిశ్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. స్థానిక కుంబారివీధికి చెందిన సురేష్ హరిజన్(29) అనే పేషెంట్‌ను అతడి కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకొచ్చారు. అయితే డాక్టర్లు అతడికి అవసరమైన చికిత్స చేసినా మృతి చెందాడు. అయితే డాక్టర్ల నిర్లక్ష్యం వలనే సురేష్ మరణించాడని ఆరోపిస్తూ డాక్టర్లను, వైద్య సిబ్బందిని అసభ్య పదజాలంతో దూషిస్తూ, ఫర్నీచర్ ధ్వంసం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి ఏఎస్‌ఐ డీకే మల్లిక్ దర్యాప్తు ప్రారంభించినట్లు వెల్లడించారు. ఈ కేసులో నిందితుల్లో ఒకడైన కుంబారివీధికి చెందిన రమేష్ హరిజన్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. కేసు ఇంకా దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

హామీలు అమలు చేయాలి

పర్లాకిమిడి: ఎన్నికల సమయంలో బీజేపీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి డిమాండ్ చేశారు. ఈ మేరకు గుమ్మా సమితి కేంద్రంలో నువాసాహి నుంచి గుమ్మా సమితి కార్యాలయం వరకూ జరిగిన ర్యాలీలో బీజేడీ రాష్ట్ర కార్యదర్శి ప్రదీప్ నాయక్, జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ దాడులు

భువనేశ్వర్: అంగుల్ జిల్లా తాల్చేర్ గనుల డిప్యూటీ డైరెక్టర్ (డీడీఎం) ధరణీధర్ నాయక్ ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలపై ఒడిశా విజిలెన్స్ అధికారులు సోమవారం దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో 10 మంది డీఎస్పీలు, 16 మంది ఇన్‌స్పెక్టర్లు, 7 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లు, సహాయ సబ్ ఇన్‌స్పెక్టర్లు ఏకకాలంలో ఇళ్లలో సోదాలు నిర్వహిస్తున్నారు. తాల్చేరు, భువనేశ్వర్, కెంజొహర్ ప్రాంతాల్లో 8 వేర్వేరు చోట్ల దాడులు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు రూ.9.8 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. నగర శివారు పటియా సురేఖ ఆర్చిడ్ శిశు విహార్‌లో ఒక ఫ్లాట్, బొడొనాలి సింకులాబహల్, జగ్‌మోహన్‌పూర్ తెల్‌కోయి, కెంజొహర్ ప్రాంతంలో 15 దుకాణాలు (గ్రౌండ్ ఫ్లోర్‌లో 9 దుకాణాలు, 1వ అంతస్తులో 6 దుకాణాలు)తో కూడిన ఒక రెండు అంతస్తుల మార్కెట్ కాంప్లెక్స్, ఈ సముదాయానికి ఆనుకుని నిర్మాణంలో ఉన్న ఒక రెండు అంతస్తుల భవనం, చాముండా గ్రామంలో పితృ ఆర్జిత ఇల్లు ఇతరేతర ఆస్తులను గుర్తించారు.

సభలో సంతాపం

భువనేశ్వర్: ఇటీవల మృతి చెందిన సంబపూర్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అశ్విని గురుకి శాసనసభలో సోమవారం సంతాపం ప్రకటించారు. ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝీ ప్రతిపాదించిన సంతాప తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదించడంతో సభకు హాజరైన సభ్యులంతా కాసేపు మౌనం ప్రదర్శించి నివాళులర్పించారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ


మొక్కలు పంపిణీ చేస్తున్న దృశ్యం

జయపురం: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని వక్తలు పేర్కొన్నారు. పట్టణంలో సీవా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మొక్కలనరు సోమవారం నాటారు. అలాగే 500 మొక్కలను ప్రజలకు అందజేశారు.

పాముకాటుతో బాలిక మృతి


సోనాలీ మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని పోడియా సమితి కల్ధాపల్లి పంచాయతీ ఎంవీ 62 గ్రామంలో పాముకాటుతో బాలిక మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే.. ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో భోజనం చేసి ఇంట్లో పడుకుంటున్న సమయంలో సోనాలీ మండాల్(13)కు నాగుపాము కాటు వేసింది. దీంతో బాలిక తండ్రి గుర్తించి పోడియ ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లాడు. అయితే అక్కడ ఇంజెక్షన్ లేకపోవడంతో మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి పంపించారు. కాగా అక్కడ బాలిక చికిత్స పొందుతూ సోమవారం ఉదయం 8 గంటల సమయంలో బాలిక మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

కొరాపుట్‌లో ఎంపీ బలభద్ర పర్యటన

కొరాపుట్: కొరాపుట్ జిల్లా కేంద్రంలో నబరంగ్‌పూర్ పార్లమెంట్ సభ్యుడు బలభద్ర మఝి సోమవారం పర్యటించారు. దీనిలో భాగంగా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. ఆయనతో పాటు పార్టీ జిల్లా అధ్యక్షుడు సుమంత్ ప్రధాన్ (కొరాపుట్), జగదీష్ బిసోయి (నబరంగ్‌పూర్)లు ఉన్నారు.

విద్యార్థుల ఆందోళన


ఆందోళన చేపడుతున్న విద్యార్థులు


కొరాపుట్: జిల్లాలో ఒడిశా కేంద్రీయ విశ్వ విద్యాలయం సునాబెడాలోని క్యాంపస్‌లో ఆహారం బాగోలేదని విద్యార్థులు ఆదివారం రాత్రి ఆందోళన చేపట్టారు. హాస్టల్‌లో ఆహారంపై తాము ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఆహరం సరఫరా కాంట్రాక్ట్‌ని ఒక ప్రైవేటు సంస్థకి యూనివర్సిటీ యాజమాన్యం అప్పగించినప్పటి నుంచి ఈ వివాదం కొనసాగుతోంది. అయితే విద్యార్థులు తమ నిరసన కొనసాగిస్తుండగా యునివర్సిటీకి సంబంధం లేని కొందరు వ్యక్తులు వచ్చి బెదిరింపులకు దిగారు. దీంతో వివాదం ముదిరింది. ఆ వ్యక్తులు విద్యార్థులపై దౌర్జన్యానికి దిగి నిరసనలు ఆపాలని హెచ్చరించారు. దీంతో ఒక్కసారిగా విద్యార్థులందరూ ఐకమత్యంతో ఆ వ్యక్తులను బంధించారు. ఇది తెలిసి సునాబెడా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఆ వ్యక్తులను తమకు అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. అయితే విద్యార్థులు వెనుకంజ వేయకుండా పోలీసు వాహనం ముందు బైఠాయించారు. ఈ వివాదం సోమవారం ఉదయం వరకు కొనసాగింది. అనంతరం పోలీసులు నచ్చజెప్పడంతో ఆ వ్యక్తులను పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై అధికారులు దర్యాప్తునకు ఆదేశించారు.
02ఒఆర్ఎస్55: ఆందోళన చేపడుతున్న విద్యార్థులు

యువకుడి మృతిపై ఆందోళన


ఉరికి వేలాడుతున్న ప్రఫుల్ల మృతదేహం

కొరాపుట్: జిల్లాలోని సిమిలిగుడ సమితి పక్కజొల గ్రామ పంచాయతీ దొళాయిగుడ గ్రామానికి సమీపంలోని మామిడి తోటలో ప్రఫుల్ల హంతాల్ (25) అనే యువకుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. వెంటనే సిమిలిగుడ పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడు నందపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పరజామత్తయి గ్రామ పంచాయతీ లికిడుగుడ గ్రామానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. మృతుడు భువనేశ్వర్‌లోని ఒక ప్రైవేటు కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తూ స్వగ్రామం వచ్చాడు. గత బుధవారం నుంచి కనిపించడం లేదని కుటుంబీకులు పేర్కొన్నారు. కానీ మృతదేహం ఉరికి వేలాడుతూ నేలకు తగిలి ఉండడంతో ఇది హత్యగా ఆరోపిస్తూ గిరిజనులు ఆందోళనకి దిగారు. వివాదం పెరగడంతో సునాబెడా ఎస్డీపీవో మనోబ్రత సత్పతి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కొరాపుట్ నుంచి క్లూస్ టీమ్‌లను తెప్పించి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి కొరాపుట్ జిల్లా కేంద్రంలోని సాహిద్ లక్ష్మణ్ నాయక్ ప్రభుత్వ వైద్య కళాశాలలో పోస్టుమార్టం నిర్వహిస్తామని పోలీసులు ప్రకటించారు.

కాలువలో పడి బాలుడు మృతి


బాలుడి మృతదేహం

కొరాపుట్: కాలువలో పడి బాలుడు మృతి చెందిన ఘటన కొరాపుట్ జిల్లా సిమిలిగుడ సమీపంలోని చక్కర్లిపుట్‌లో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఓం (7) అనే బాలుడు తన తోటి ఇద్దరి మిత్రులతో కలిసి సునాబెడా సమీపంలోని నర్సరీ దగ్గర కాలువలో స్నానానికి వెళ్లాడు. అయితే అక్కడ ప్రవాహం ఎక్కువగా ఉండడంతో దురదృష్టావశాత్తు మునిగిపోయాడు. వెంటనే మిగతా బాలలు వెళ్లి స్థానికులకు తెలియజేశారు. దీంతో అగ్నిమాపక కేంద్రం సిబ్బంది వచ్చి మృతదేహాన్ని వెలికి తీశారు. బాలుడి మృతితో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.

రైళ్ల వేగం పెంచండి

కొరాపుట్: కొరాపుట్-రాయగడల మధ్య రైళ్ల వేగం పెంచాలని కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్క విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఈస్ట్‌కోస్ట్ జీఎం పరమేశ్వర్ ఫక్వాల్‌ను భువనేశ్వర్‌లోని అతని కార్యాలయంలో కలిశారు. నబరంగ్‌పూర్-జయపూర్-మల్కన్‌గిరిల మధ్య రైల్వేలైన్ నిర్మాణం కోసం భూసేకరణ నత్త నడకగా సాగుతోందన్నారు. గుణుపూర్-తెరువల్లి రైల్వేలైన్‌కి పద్మపూర్‌ను కలపాలని కోరారు. నౌపడా-గుణుపూర్‌ల మధ్య రైళ్ల వేగం కూడా పెంచాలని విన్నవించారు. పగటిపూట జగదల్‌పూర్-జయపూర్-కొరాపుట్-రాయగడల మీదుగా భువనేశ్వర్‌కి రైలు వేయాలన్నారు.

పలు రైళ్లు రద్దు

భువనేశ్వర్: బంగాళాఖాతంలో ఏర్పడిన భారీ వర్షాల ప్రభావంతో రైలు పట్టాలు నీట మునగడంతో తూర్పు కోస్తా రైల్వే పరిధి లో రైలు సేవలు విపరీతంగా ప్రభావితమయ్యాయి. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే విజయవాడ – సికింద్రాబాద్ డివిజన్ పరిధి లో పలురైళ్లు రద్దు చేసినట్లు రైల్వే శాఖ ప్రకటించింది.

రైలు	తేదీ
12864 ఎస్‌వీఎం బెంగళూరు హౌరా సూపర్ ఫాస్టు ఎక్స్‌ప్రెస్	03.09.2024
12740 సికింద్రాబాద్ - విశాఖపట్నం గరీబ్ రథ్ ఎక్స్‌ప్రెస్	02.09.2024
12739 విశాఖపట్నం- సికింద్రాబాద్ గరీబ్ రథ్ ఎక్స్‌ప్రెస్	02.09.2024
12841 షాలిమార్ - ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ కోరమాండల్ ఎక్స్‌ప్రెస్	02.09.2024
22605 పురులియా - తిరునెల్‌వెల్లి సూపర్ ఫాస్టు ఎక్స్‌ప్రెస్	02.09.2024
06082 షాలిమార్ - కొచ్చువేలి స్పెషల్ ఎక్స్‌ప్రెస్	02.09.2024
12665 హౌరా - కన్యాకుమారి సూపర్ ఫాస్టు ఎక్స్‌ప్రెస్	02.09.2024
22841 సంత్రాగచ్చి - తాంబరం అంత్యోదయ ఎక్స్‌ప్రెస్	02.09.2024
22837 హతియా - ఎర్నాకులం ధరి అబ్బా సూపర్ ఫాస్టు ఎక్స్‌ప్రెస్	02.09.2024
22817 హౌరా - మైసూరు సూపర్ ఫాస్టు ఎక్స్‌ప్రెస్	06.09.2024
12728 హైదరాబాద్ - విశాఖపట్నం గోదావరి ఎక్స్‌ప్రెస్	02.09.2024
12739 విశాఖపట్నం- సికింద్రాబాద్ గరీబ్ రథ్ ఎక్స్‌ప్రెస్	03.09.2024
20805 విశాఖపట్నం - న్యూఢిల్లీ ఏపీ ఎక్స్‌ప్రెస్	02.09.2024
22860 ఎంజీఆర్ చెన్నై సెంట్రల్- పూరీ ఎక్స్‌ప్రెస్	02.09.2024
12774 సికింద్రాబాద్ - షాలిమార్ ఏసీ ఎక్స్‌ప్రెస్	03.09.2024
12773 షాలిమార్ - సికింద్రాబాద్ ఏసీ ఎక్స్‌ప్రెస్	04.09.2024
22204 సికింద్రాబాద్ - విశాఖపట్నం దురంతో ఎక్స్‌ప్రెస్	02.09.2024
17487 కడప - విశాఖపట్నం తిరుమల ఎక్స్‌ప్రెస్	02.09.2024
20707 సికింద్రాబాద్ - విశాఖపట్నం వందే భారత్ ఎక్స్‌ప్రెస్	03.09.2024
20708 విశాఖపట్నం - సికింద్రాబాద్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్	03.09.2024
20833 విశాఖపట్నం - సికింద్రాబాద్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్	03.09.2024
20834 సికింద్రాబాద్ - విశాఖపట్నం వందే భారత్ ఎక్స్‌ప్రెస్	03.09.2024
18046 హైదరాబాద్- షాలిమార్ ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్	04.09.2024
17480 తిరుపతి - పూరీ ఎక్స్‌ప్రెస్	03.09.2024
12861 విశాఖపట్నం మహబూబ్‌నగర్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్	03.09.2024
12862 మహబూబ్‌నగర్ - విశాఖపట్నం సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్	03.09.2024
08584 తిరుపతి - విశాఖపట్నం ప్రత్యేక ఎక్స్‌ప్రెస్	03.09.2024
22702 గుంటూరు - విశాఖపట్నం ఉదయ్ ఎక్స్‌ప్రెస్	02.09.2024
11020 భువనేశ్వర్ - సీఎస్టీ ముంబై కోణార్క్ ఎక్స్‌ప్రెస్	02.09.2024
20806 న్యూఢిల్లీ - విశాఖపట్నం ఏపీ ఎక్స్‌ప్రెస్	04.09.2024
11019 సీఎస్టీ ముంబై - భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్	04.09.2024

ఆరోగ్య బీమా డిమాండ్

భువనేశ్వర్: మద్యం ద్వారా ప్రభుత్వ ఖజానాకు అత్యధిక ఆదాయం వస్తోంది. మరో వైపు అమాయకుల ప్రాణాలను బలి గొంటుంది. కాబట్టి మద్యం ప్రియులకు ఆరోగ్య బీమా కల్పించాలని విపక్ష బిజూ జనతా దళ్ సభ్యుడు సభలో గళమెత్తారు. మద్య రహిత రాష్ట్రం హామీతో బీజేపీ రాష్ట్ర పాలన పగ్గాలు చేపట్టింది. అధికారంలోకి వచ్చిన తర్వాత హామీ కార్యాచరణపై సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తోంది. ఇంతలో ఎంతోమంది జీవితాలు మద్యానికి బలైపోతున్నాయని, అందువలన నిషేధం లేకపోతే, బీమా ప్రకటించాలని చంపువా నియోజకవర్గం ఎమ్మెల్యే సనాతన్ మహాకుడ్ డిమాండ్ చేశారు.

శిక్షణా శిబిరం ప్రారంభం


శిక్షణకు వచ్చిన అధికారులతో సస్మితా మెలకా

కొరాపుట్: ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే డేటా ఆపరేటర్ల శిక్షణా శిబిరం ప్రారంభమైంది. కొరాపుట్ జిల్లా కేంద్రంలోని స్టేడియం సమీపంలో ఉన్న జిల్లా పంచాయతీరాజ్ కేంద్రం కార్యాలయంలో కొరాపుట్ జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సస్మితా మెలకా సోమవారం ప్రారంభించారు. ఈ శిబిరంలో అకౌంటెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్ అధికారులకు 9 రోజులు శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ వలన అపరేటర్లు ప్రభుత్వ కార్యాలయాల్లో వేగవంతంగా ప్రజలకు సేవలు అందిస్తారని ఆకాంక్షించారు.

విద్యుత్ కోతలతో ఇబ్బందులు

రాయగడ: సదరు సమితిలోని తడమ, పితామహాల్, జిమిడిపేట, బైరాగి హలువ పంచాయతీలకు చెందిన రైతులు విద్యుత్ కోతలతో ఎదుర్కొంటున్న ఇబ్బందులను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ పంచాయతీల్లో సుమారు రెండు వందల ఎకరాల విస్తీర్ణంలో వివిధ పంటలను పండిస్తున్నామని తెలిపారు. కానీ విద్యుత్ కోతలు వలన సకాలంలో నీరు అందక పంటలు పాడైపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. లో వోల్టేజీల కారణంగా మోటార్లు కాలిపోతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఫరూల్ పట్వారీ సంబంధిత ఏఈతో సంప్రదించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఆదుకోండి..!


కొడుకుతో కుంబార్

రాయగడ: ఎటువంటి ఆధారంలేని తమను ఆదుకోవాలని స్థానిక రైతుల కాలనీలో నివసిస్తున్న కమలేశ్వరకుంబార్ కోరారు. ఈ మేరకు కలెక్టర్ ఫరూల్ పట్వారిని సోమవారం కలిసి తన కష్టాలను చెప్పుకున్నారు. కరోనా సమయంలో భర్త మరణించడంతో ఉండడానికి ఇల్లు, తినడానికి తిండిలేక 9 ఏళ్ల బాబుతో ఇబ్బందులు పడుతున్నానని ఆవేదన వ్యక్తం చేసింది. కనీసం పెన్షన్ కూడా రావడం లేదని వాపోయింది. దీంతో కలెక్టర్ స్పందించి ప్రభుత్వం తరుపున సాయం అందజేస్తామని హామీ ఇచ్చారు.

నిలిచిన రాకపోకలు


కోతకు గురైన రహదారి

రాయగడ: జిల్లాలో బిసంకటక్ సమితి చొంచాడగుడ పంచాయతీలోని కెరండీ గ్రామానికి వెళ్లే రహదారి రెండు రోజులుగా కురిసిన వర్షాల కారణంగా కోతకు గురయ్యింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. ప్రతీ ఏడాది వర్షాకాలంలో ఇదే సమస్య ఎదురవుతోందని, కల్వర్టు నిర్మించాలని అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్వర్టు నిర్మించాలని కోరారు.